# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 14 అక్టోబరు, 2026 | పేజీలు : 08


## రైతుల సమక్షంలో భూముల రీ సర్వే

కలెక్టర్ గరిమ అగ్రవాల్



2లో

# అమ్మవారికి నూతన ఆభరణాలు ధరించాలి!

### బాసర తరహాలో భద్రత కల్పించాలి , అడెల్లి పోచమ్మ భక్తుల ఆరాధన

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** సహ్యాద్రి కొండల్లో వెలిసిన శ్రీ అడిల్లి మహా పోచమ్మ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ప్రసిద్ధిగాంచింది. పురాతన కాలంలో వెలసిన ఈ అమ్మవారు పరిసర గ్రామాల ప్రజలకే కాకుండా నేడు రాష్ట్రస్థాయిలో భక్తులకు దీవెనలు అందించే స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలోని నలుమూలల నుండే కాకుండా మహారాష్ట్ర నుండి కర్ణాటక నుండి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు.సంవత్సరాంతంలో కేవలం శ్రావణమాసంలో మాత్రమే భక్తుల తాకిడి తక్కువ కాగా మిగతా ఆదివారాలు మొత్తం భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడతాయి. సుమారు ప్రతి ఆదివారం 20 వేల నుండి 50 వేల వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుని దీవెనలు పొందుతారు. ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిన తర్వాత దినదినాభివృద్ధి చెందుతూ వస్తోంది. గత సంవత్సరం విశాలమైన కృష్ణ




శిలలతో నిర్మించిన ఆలయంలో ప్రతిష్టింపజేశారు.శ్రీ మహా పోచమ్మ గంగ నీళ్ల జాతర గత పూర్వం నుండి జరుగుతోంది. ప్రతి ఆదివారం భక్తుల తాకిడి ఎంతున్నా .. సంవత్సరానికి ఒకసారి నిర్వహించే

తరువాయి 2 లో...

# పేరుకే చెక్‌పోస్టు.. యథేచ్ఛగా అక్రమ రవాణా!

### పెద్దబండ చెక్‌పోస్టు వద్ద పర్యవేక్షణ లోపం

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** మండలంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు అక్రమ రవాణాను అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని పెద్దబండ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు అక్రమ రవాణాకు మార్గం సుగమం చేస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినప్పటికీ, నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆశించిన ఫలితం కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ చెక్‌పోస్టు వద్ద గతంలోనూ అక్రమ వ్యాపార వాహనాల రాకపోకలు యథేచ్ఛగా సాగినట్లు, సంబంధిత శాఖల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శిస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం, వాహనాల తనిఖీల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించడం వల్ల అక్రమ రవాణా ఎలాంటి ఆటంకం లేకుండా సాగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ అక్రమ వ్యాపారాలు ఆగకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి చెక్‌పోస్టుల పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని, సిబ్బందిని నిరంతరం విధుల్లో అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు. అక్రమ రవాణాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేలా నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# సాంకేతిక వైద్య సేవల్లో .. యశోద ఆసుపత్రి ముందంజ

### రోబోటిక్ సర్జన్ డా. విక్రమ్ బైరి

**ప్రజాపక్షం/జగిత్యాల :** ఆధునిక వైద్య సాంకేతికతను అందిపుచ్చుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో యశోద ఆసుపత్రి ముందుంటుందని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు విక్రమ్ బైరి అన్నారు.జగిత్యాల పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యుడు విక్రమ్ బైరి మాట్లాడుతూఎముకల అరుగుదల,కీళ్ల సమస్యలతో బాధపడుతున్న పలువురికి ఆధునిక సాంకేతికతతో కూడిన రోబోటిక్ సర్జరీ ద్వారా చికిత్స అందించినట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా నుంచి ఎంతోమంది హైదరాబాద్‌లోని తమ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారని గుర్తు చేశారు.ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో హైదరాబాద్‌కు పోలేని రోగులకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రతి నెల రెండవ మంగళవారం జగిత్యాల పట్టణంలోని కనెక్ట్ ఆసుపత్రి యందు అందుబాటులో ఉంటామని తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.కీళ్ల సమస్యలకు రోబోటిక్ సర్జరీ ద్వారా ఆధునిక చికిత్స అందిస్తున్నామని,తగిన వైద్య విధానాలతో రోగులు త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.ప్రభుత్వ ఉద్యోగుల కోసం తమ ఆసుపత్రిలో ఈహెచ్‌ఎస్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని విక్రమ్ బైరి తెలిపారు.ఈ సమావేశంలో మేనేజరులు రాజేష్,ఎగ్జిక్యూటివ్ వంశీ,తదితరులు పాల్గొన్నారు.




# బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా వ్యవహరించాలి

### ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పి మహేష్ బి. గితే

**పజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. మంగళవారం జిల్లాలోని ముస్తాబాద్ మండల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపడాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో వర్టికల్స్ వారిగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని స్టేషన్ పరిధిలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై



చట్టపరంగాకఠినచర్యలుతీసుకోవాలనిఅన్నారు.గ్రామీణప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని గ్రామాలలో అవగాహన కార్యక్ర మాలు చేపట్టాలని ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వ ంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్సై జ్యోతి, సిబ్బంది ఉన్నారు.

# పదవి అధికారం కాదు.. ఒక బాధ్యత

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సిరిసిల్లలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి అనేది అధికారం కాదని అది ఒక బాధ్యతగా సేవకు దొరికిన అవకాశంగా భావించాలని అన్నారు. దేవుని కృపతో మీ అందరి సహకారంతో ఈ నూతన కమిటీ సంఘాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టుకోవాలని ఏసుక్రీస్తు ప్రభువు లోకానికి అందించిన అతి గొప్ప సందేశం ప్రేమ, కరుణ, సేవ అని సమాజంలో వెనుకబడినవారికి పేదలకు తోడుగా నిలబడమని ఆయన బోధించారని తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా సమానత్వంతో ఐక్యంగా జీవించాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఉద్దేశమని పేర్కొన్నారు. పాస్టర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు బి.ఎలిషా, ఉపాధ్యక్షులు మేకల అరుణ్ కుమార్, జనరల్ సెక్రటరీ సామ్యూల్, సంయుక్త కార్యదర్శి కడారి శేఖర్, కోశాధికారి వడ్డేపల్లి ఇసాక్, కార్యవర్గ సభ్యులు బిట్ల మోసెస్, లకవత్ ఏసుదాస్ లకు శుభాకాంక్షలు తెలిపారు.

# దసరా సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసేవారు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం / గంగాధర : దసరా సెలవుల సందర్భంగా చాలామంది కుటుంబాలలో స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్తున్న నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఇంటి ప్రధాన ద్వారాలు, కిటికీలు, వెనుక ద్వారాలకు పటిష్టమైన తాళాలు వేయాలని, విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని సూచించారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో బహిరంగంగా పోస్ట్ చేయవద్దని తెలిపారు. అనుమానస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తాళం వేసి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేసి ఇంటిపై కాస్త నిఘా ఉంచమని కోరాలని, వీలైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని అవి సరిగ్గా పని చేస్తున్నాయా లేదో తనిఖీ చేసుకోవాలని వివరించారు. ఇంట్లో ఎవరూ లేరనే విషయం బయటకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాళాలు వేసి వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏదైనా అనుమానస్పద ఘటన జరిగితే డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు.

# రూ.32 లక్షల వ్యయంతో బతుకమ్మ ఘాట్ల నిర్మాణం

సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ చక్రపాణి

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ప్రజల సౌకర్యార్థం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో వివిధ వార్డులలో రూ.32 లక్షల వ్యయంతో బతుకమ్మ ఘాట్లను నిర్మిస్తున్నామని సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ చక్రపాణి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 2, 12, 21, 38వ వార్డులలో నిర్మిస్తున్న బతుకమ్మ ఘాట్ల పనుల పురోగతిని సిరిసిల్ల మున్సిపల్ కమీషనర్ ఎండి ఖాదిర్ పాషాతో కలిసి పరిశీలించారు. ఇట్టి నిర్మాణాలను పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అంతేకాకుండా సిరిసిల్ల పురపాలక



సంఘం పరిధిలోని అన్ని బతుకమ్మ ఘాట్ల వద్ద ప్రజలకు ముఖ్యంగా మహిళలకు చిన్నారులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన లైటింగ్, మంచినీరు, బారికేడ్లు పరిసరాల పరిశుభ్రత కోసం రూ.29 లక్షల 50 వేల నిధులతో పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వేముల రాములు, ఎలుక వెంకటేశం, రిక్కమల్లె రంజిత సంపత్, డికా వాణి, ఏఈ నరసింహాస్వామి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ప్రజాపక్షం / గంగాధర : తెలంగాణలో ప్రస్తుతం వచ్చిన కరువు కాలం తెచ్చింది కాదని ముమ్మాటికీ ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని, రాష్ట్రంలో రైతాంగం యాసంగి పంట వేయొద్దని కాంగ్రెస్ మంత్రులు చెప్పడం సిగ్గుచేటని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. పంటలు పండించకుండా రైతులు ఏం చేయాలని ప్రశ్నించారు. మంగళవారం గంగాధరలో ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. రానున్న రోజుల్లో సాగునీరే కాదు, తాగునీటికి కూడా ఇబ్బందులు వస్తాయని చెబుతూ కాంగ్రెస్ మంత్రులు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు. నీళ్ల లేవు, కరెంటు ఇవ్వలేం, రెండో పంట వేయొద్దని పత్రికల ద్వారా మంత్రులు చెప్పడం ప్రజా పరిపాలనా అని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో కిలో బియ్యం వంద రూపాయలు అవుతుందని ప్రజలను భయపెట్టడమేనా పాలన అంటే అని ప్రశ్నించారు. రైతులు ఏం చేయాలో మాత్రం ప్రభుత్వం చెప్పడం లేదని ఇది అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ ఇవ్వడంతోపాటు



కాళేశ్వరం జలాలు, చెరువుల నిండా నీళ్లు, రైతుబంధు, రైతు భీమాతో యాసంగి, వానాకాలం రెండు పంటలు పండాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పదేళ్లు కడుపునిండా తిన్న తెలంగాణను మళ్లీ కరువు తెలంగాణగా మారుస్తున్నారని ముందు చూపు లేని పాలనతోనే తాగు, సాగునీటికి ఇబ్బందులు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సర్వీస్ రోడ్డు కోసం ఈదులగట్టెపల్లి వాసుల ఆందోళన

ప్రజాపక్షం / మానకొండూర్ : మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి గ్రామానికి సర్వీస్ రోడ్డు కనెక్టివిటీ కల్పించాలని కోరుతూ గ్రామస్తులు జాతీయ రహదారి 563పై గంటపాటు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో హైవేపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. గ్రామ సర్పంచ్ మీస సత్యనారాయణ మాట్లాడుతూ గత ఆరు నెలలుగా సరైన రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు రాంగ్ సైడ్ నుంచి రావాల్సి వస్తోందని దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు లేకపోవడంతో రైతులు, ఉద్యోగులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్‌హెచ్ 563 పనుల్లో భాగంగా అధికారులు రాత్రి 12 గంటలకు వంద మంది పోలీసులతో వచ్చి తెల్లవారుజామున 4 గంటల లోపే రోడ్డు పనులు పూర్తి చేశారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, సీఐ శ్రీలత ఎస్సై తిరుపతి సిబ్బందితో ఘటనా



స్థలానికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. అయితే కలెక్టర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, కాంట్రాక్టర్ వచ్చేవరకు ధర్నా విరమించబోమని గ్రామస్తులు స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ విజయ్ కుమార్ అక్కడికి చేరుకొని గ్రామస్తులతో చర్చించారు. మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ధర్నా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. అండర్ పాస్‌తోపాటు సర్వీస్ రోడ్డు నిర్మాణమయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# జిల్లా కాంగ్రెస్ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా తాటిపల్లి రాజన్న

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా జమ్మికుంటకు చెందిన రాష్ట్ర



ఆర్యవైశ్య నాయకుడు తాటిపల్లి రాజన్న నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం కరీంనగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు డా.మేడిపల్లి సత్యం, హుజురాబాద్ నియోజకవర్గం ఇంఛార్జి ఒడితెల ప్రణవ్‌కు తాటిపల్లి రాజన్న కృతజ్ఞతలు తెలిపారు.

# దుర్గామాతను దర్శించుకున్న హన్మండ్ల భాస్కర్

ప్రజాపక్షం / గన్నేరువరం : గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో దుర్గామాత పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. దేవి నవరాత్రుల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అమ్మవారిని టీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుధగోని లక్ష్మణ్ గౌడ్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు న్యాలపట్ల శంకర్ గౌడ్, ఎస్ఎల్ఎన్ యూత్ గౌరవ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి గౌడ్, బండిపల్లి రాజు, ములుకల అంజి, సుధగోని మని, చరణ్, సుధగోని వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారికి నూతన ఆభరణాలు ధరించాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఈ జాతర అమ్మవారికి ప్రత్యేకం. అమావాస్య తర్వాత దసరాకు ముందు వచ్చే ఆదివారం ఈ గంగానీళ్ల జాతర కొనసాగుతోంది.శనివారం రోజు ఆలయం నుండి ఆభరణాలతో బయలుదేరి దిలావర్పూర్ మండలంలోని సాంగ్వి గోదావరి నదికి చేరుకుని ఉదయం అమ్మవారి ఆభరణాలను పవిత్ర గోదావరి నీటితో శుభ్రపరిచి తిరుగు ప్రయాణమై సాయంత్రానికి ఆలయానికి చేరుకుంటుంది. కాలినడకన సాగే ఈ ప్రయాణంలో భక్తుల రద్దీ వర్ణనాతీతం.గత పూర్వకాలం నుండి అమ్మవారికి అవే నగలను గోదావరికి తీసుకెళ్లి వాటినే శుద్ధపరిచి ధరిస్తున్నారని వాటి స్థానంలో భక్తులు సమర్పించిన టువంటి కట్న కానుకల ద్వారా సమర్పించిన బంగారు ఆభరణాలను అమ్మవారి విగ్రహానికి తగినట్లుగా తయారు చేయించి అలంకరించడంతోపాటు ప్రతి గంగ నీళ్ల జాతరకు కూడా వీటినే ఉపయోగించాలని భక్తుల ఆరాధన.బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారికి ఉన్నటువంటి భద్రత ఏర్పాట్లను అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయంలో కూడా ఏర్పాటు,నిరంతర నిఘా నిర్వహిస్తూ ఆభరణాలను ధరించి నిత్య నూతనంగా విరాజిల్లేజేస్తూ అలాగే పురాతన నగలను బ్యాంకుల్లో భద్రపరిచి నూతన ఆభరణాలను గంగ నీళ్ల జాతరకు కూడా ఉపయోగించాలని వేల సంఖ్యలో తరలి వచ్చే శ్రీ మహా పోచమ్మ భక్తుల కోరిక, ఆరాధన.అడెల్లి శ్రీ మహా పోచమ్మ ను తమ ఇంటి ఇలవేల్పుగా, ఒక ఆడబిడ్డగా గౌరవించే భక్తులు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పెద్ద ఎత్తున కట్న కానుకలు సమర్పిస్తుంటారు. ఈ కట్న కానుకల భరణం దాదాపు నాలుగు కిలోల బంగారం, రెండు క్వింటాళ్ల వెండి ఆభరణాలు ఉంటాయి. అలాగే నగదు రూపేనా ఆలయానికి భారీగా ఆదాయం ఉంది. వీటన్నింటినీ బ్యాంకుల్లో భద్రపరుస్తోంది దేవాదాయ శాఖ. ఇందులోంచి కొంతైనా పాతవాటి స్థానంలో కొత్తవి తయారు చేయించి గంగ నీళ్ల జాతరకైనా నూతనంగా అలంకరించాలని భక్తుల చిరకాల వాంఛ.అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయ భక్తుల కోరిక మేరకు పురాతన ఆభరణాల స్థానంలో కొత్తవి తయారు చేయించాలనే భక్తుల విన్నపాన్ని దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాను ఇంచార్జ్ ఇఒ కే. భూమయ్య

# రైతుల సమక్షంలో భూముల రీ సర్వే

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : భూ భారతి కింద భూముల రీ సర్వే రైతుల సమక్షంలో చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండలం వరదవెల్లిలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే యంత్రంతో వివరాలు ఎలా తీసుకుంటున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వేపై రైతులకు ముందుగా జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు సమాచారం అందించాలని సూచించారు. భూముల వివరాలను పూర్తి ఖచ్చితత్వంతో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు సమాచారం అందించి భూముల రీ సర్వే చేయాలని స్పష్టం చేశారు.తహసీల్దార్ షరీఫోద్దీన్, సర్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పండుగల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల ప్రజలకు ఎల్లారెడ్డిపేట వలయాధికారి ఓ వెంకటేష్ హెచ్చరికలు జారీ చేశారు. దసరా, దీపావళి పండగల సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పండగ సెలవుల నేపథ్యంలో వేరే ప్రాంతాలకు వెళ్లే వారు బంగారం, వెండి ఆభరణాలు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. చెరువుల్లో ఈతకు వెళ్లే యువత జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# అసత్య వార్త కథనాలను ప్రచురించొద్దు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: అసత్య ప్రచారాలను చేయడం వల్ల పోలీసు అధికారులకు పరిశోధన పై ఆటంకం కలుగుతుందని ఎల్లారెడ్డిపేట సిఐ వెంకటేష్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియా ప్రకటన చేస్తూ మాట్లాడారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రిపోర్ట్ అయిన కేసు విషయంలో పోలీసుల ఇన్వెస్టిగేషన్ కు సహకరించకుండా అడిగిన సమాచారం ఇవ్వకుండా గంభీరావుపేట ఎస్సై పైన ఇతర పోలీసుల పైన అసత్య ప్రచారం చేస్తూ వ్యక్తిగతంగా కించపరుస్తూ వరుస కథనాలు రాస్తూ పోలీస్ ఇన్వెస్టిగేషన్ ను తప్పుదారి పట్టించేటట్లు చేసిన ఓ దినపత్రిక ఎడిటర్ తో పాటు మరో రిపోర్టర్ పై కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

# కెసిఆర్ హయాంలోనే అభివృద్ధి పథంలో తెలంగాణ

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

### పెద్దపల్లిలో ఘనంగా

### జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని నడిపించడమే కాకుండా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పెద్దపల్లి జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, దేశంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చినప్పటికీ ఒకవైపు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, మరోవైపు తక్కువ కాలంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పడే నాటికి 7,778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ సామర్థ్యాన్ని దాదాపు 20 వేల మెగావాట్ల స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశారని తెలిపారు.ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులు తిరిగి సాగునీరు, విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు.వేసంగి పంటలు వేయవద్దని మంత్రులు సూచించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. పెద్దపల్లి రైతుల అవసరాల కోసం గత ప్రభుత్వం రాళ్లపల్లి వద్ద వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు లింక్ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.ప్రస్తుతం 1,100 క్యూసెక్కుల నీరు అవసరముండగా కేవలం 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారని, ఎస్సారెస్పీ కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, పంటల బోనస్,ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

**ప్రజలకు పాలనను చేరువ చేసిన ఘనత కేసీఆర్‌దే కోరుకంటి చందర్.. :** బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాళేశ్వరం వంటి దూర ప్రాంతాల ప్రజలు కలెక్టర్‌ను కలవాలంటే దాదాపు 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ చిన్న జిల్లాలను ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారని తెలిపారు.కేసీఆర్ ప్రవేశపెట్టిన 129 సంక్షేమ పథకాలు మానవీయ కోణంతో రూపొందించినవేనని, వృద్ధులకు రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2,000కు పెంచి ఆర్థిక భరోసా కల్పించారని కొనియాడారు. పేదలు, వృద్ధులు, నిరుపేద కుటుంబాల సంక్షేమానికి కేసీఆర్ పాలన ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు.

**పెద్దపల్లి అభివృద్ధికి కేసీఆర్, దాసరి మనోహర్ రెడ్డి విశేష కృషి దాసరి మమతారెడ్డి :** పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకొని కేసీఆర్ జిల్లాల పునర్విభజన చేపట్టారని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటుతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, మాతా శిశు సంరక్షణ కేంద్రం, డయాలసిస్ యూనిట్, టీడయాగ్నోస్టిక్స్ వంటి వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.నాటి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కృషితో పట్టణంలో విశాలమైన రహదారులు,సెంట్రల్ లైటింగ్ వంటి అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కేసీఆర్ కిట్ వంటి పథకాలను ఎందుకు కొనసాగించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి చిరుమల్ల రాకేష్ :** టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. మహిళా కళాశాల భవనాలు, కూనారం బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందక మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకొని పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**బతుకమ్మ సంబరాలు, ఒగ్గుడోలు నృత్యాలతో ఘనంగా జిల్లా దశాబ్ది ఉత్సవాలు :** పెద్దపల్లి జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దాసరి మమతారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు రంగురంగుల బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఠాకూర్ రఘువీర్ సింగ్, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రస్తుత కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు,గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,మహిళలు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రంగదాముని పల్లి గ్రామంలో అప్పుల బాధతో ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రంగదామునిపల్లి గ్రామానికి చెందిన నర్రా రాజిరెడ్డి (55) వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అప్పుల బాధతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజిరెడ్డి మంగళవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మృతుని భార్య నర్రా మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

# జిల్లా అధ్యక్షుడి బదిలీపై ఆంతర్యమేమిటో

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా ఓ పంచాయతీ కార్యదర్శి పై రాజకీయ నాయకుల ఒత్తిడితో జిల్లా అధికారులు బదిలీ చేయడం అధికారుల్లో జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశం కాగా ఆయన బదిలీ వెనుక రాజకీయ ప్రమేయమా లేక అధికారుల ప్రమేయం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లాపూర్ మండల అధ్యక్షుడుగా పనిచేస్తున్న కొత్తదామరాజు పల్లి పంచాయతీ కార్యదర్శి వంశీధర్ రెడ్డి అనూహ్యంగా బదిలీ కావడం పంచాయతీ కార్యదర్శులను అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది.మండలంకు చెందిన ఓ రాజకీయ నాయకుడు ప్రభుత్వంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఓ ప్రజాప్రతినిధి సహకారంతో ఈ బదిలీ జరిగిందనే వాదనలు వినిపిస్తున్నాయి.కాగా బదిలీని ఆపాలంటూ మండల పంచాయతీ కార్యదర్శులు అంతా కలిసి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసినప్పటికీ ఆగమేఘాల మీద ఎంపీడీవో కార్యదర్శిని రిలీవ్ చేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తుంది.

# అమ్మలగన్న అమ్మ.. శాకంబరీ దేవి

## భీమ్‌రాజుపల్లిలో వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

## అన్నపూర్ణాదేవి,శాకంబరీ మాతగా అమ్మవారి దర్శనం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని భీమ్‌రాజుపల్లి గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యంతో పులకించాయి.ప్రత్యేక అలంకరణల్లో జగన్మాత:నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం అన్నపూర్ణాదేవిగా, శాకంబరీ మాతగా భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ తిప్పర్తి సత్యచార్యుల పర్యవేక్షణలో ఉదయం నుంచే విశేష పూజలు, హోమాలు, గాయత్రీ మంత్ర హవన పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి. తీరొక్క కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించిన శాకంబరీ దేవిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.ఘనంగా పూజా కార్యక్రమాలుఈ వేడుకల్లో శ్రీ దుర్గా భవాని సేవా సమితి వ్యవస్థాపకులు, ఆలయ చైర్మన్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్, గ్రామ సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి, ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలకవర్గ సభ్యులతో పాటు భవానీ దీక్షా స్వాములు,గ్రామస్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆహ్వానం



**ప్రజా పక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ మండల కేంద్రంలో భరతమాత కూడాలీ వద్ద నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు అవ్వాలని నవదుర్గ సేవ సమితి సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నీ కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మంగళవారం కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. నవదుర్గ సేవా సమితి సభ్యులు రుద్ర రాంప్రసాద్ , మోర సతీష్,చింతలూరి రంజిత్ కమిటీ సభ్యులు ఉన్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా.. క్రీడలకు దగ్గరగా ఉండాలి

## ఎస్ ఐ జి. నవీన్ కుమార్

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** యువత డ్రగ్స్ కు దూరంగా ఉంటూ క్రీడలకు దగ్గరగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎస్సై జి. నవీన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మెట్పల్లి డీఎస్పీ ఎ. రాములు, సీఐ బి. సురేష్ బాబు సూచనల మేరకు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ క్రికెట్ లీగ్‌ను ఎస్సై నవీన్ కుమార్ మంగళవారం మండల కేంద్రంలో ప్రారంభించారు.ఈ మేరకు ఎస్ఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా మండల గ్రామాల యువతకు డ్రగ్స్, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి, వారిని చెడు వ్యసనాలకు దూరంగా ఉంచడమే ఈ లీగ్ యొక్కముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ క్రికెట్ లీగ్‌లో పోలీసు సిబ్బంది సైతం పాల్గొని యువతతో కలిసి ఆడుతారని ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సంతోష్,క్రీడాకారులు పాల్గొన్నారు.



# రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచిన ఖాన్ సాబ్

**ప్రజాపక్షం /కోరుట్ల :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ,కోరుట్ల సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు అమెర్ ఖాన్ (ఖాన్ సాబ్) మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగికి అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం (A+ve) అవసరమని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి,స్వయంగా రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు.రక్తం అవసరమైన సమయంలో మానవతా దృక్పథంతో ముందుకు వచ్చిన ఖాన్ సాబ్‌ను రోగి బంధుమిత్రులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.రక్తదానం పట్ల అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వారికి తనవంతు సహాయం అందించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని పలువురు పేర్కొన్నారు."సేవ చేయడానికి కోట్లు అవసరం లేదు.. రక్తదానం చేసే మంచి మనసుంటే చాలు" అనే సందేశానికి



నిదర్శనంగా ఖాన్ సాబ్ చేసిన ఈ సేవ నిలిచింది. యువత రక్తదానంపై అవగాహన పెంచుకొని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని ఆయన సేవా స్ఫూర్తి చాటుతోంది.ఈ కార్యక్రమంలో కోరుట్ల సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు షాను,జగిత్యాలకు చెందిన సోషల్ వర్కర్ రియాజ్ పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల భవనానికి స్థల పరిశీలన

**ప్రజాపక్షం /పెగడపల్లి :** భవన నిర్మాణ కార్మికుల సంఘానికి సొంత భవనం లేకపోవడంతో తమ సంఘ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ,15 రోజుల క్రితం కార్మికులు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు విషయాన్ని తెలియజేసి, స్థల పరిశీలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో రెవెన్యూ అధికారులు వెంగళాయిపేట శివారులోని సర్వే నెంబర్ 320లో స్థలాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిజామొద్దీన్,సర్పంచ్ మోకెనపల్లి గోపాల్, ఆ రైలు జమున,శ్రీనివాస్, జీపీఓ అజిముద్దీన్, సర్వేయర్ తనుజ రాణి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి,వార్డు సభ్యులు ఐతరవేణి గంగాధర్, తోట గంగయ్య, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు రాచర్ల నరేష్, కార్మికులు రవి, జలంధర్, మాజీ అంబేద్కర్ ప్రెసిడెంట్ సుంకె ప్రకాశ్, రామంచె నర్సయ్య, శ్రీరాం పోచయ్య తదితరులు పాల్గొన్నారు. తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించి,భవన నిర్మాణ కార్మికుల సంఘానికి రెండు గుంటల భూమి కేటాయింపు దిశగా చర్యలు చేపట్టడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.తమ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మంత్రికి సంఘ నాయకులు,కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ కోతలతో ఎండిపోతున్న వరి

మాజీ ఎంపిపి అత్తె చంద్రమౌళి



ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా కోత దశకు చేరుకున్న వరి పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని ముత్తారం మండల మాజీ ఎంపీపీ, ఒక్కారం గ్రామ సర్పంచ్ అత్తె చంద్రమౌళి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన ప్రజాపక్షం ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ మండలంలోని రైతాంగం ఎంతో పెట్టుబడి పెట్టి, రాత్రింబగళ్లు కష్టపడి వరి పంటను కోత దశకు తీసుకువచ్చారని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి,వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎండిపోతున్న పంటలను కాపాడి,రైతాంగాన్ని నష్టాల నుంచి గట్టెక్కించాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని,సంబంధిత అధికారులను కోరారు.

# పాత కక్షలు-పాల వ్యాపారి హత్య!

ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం ఎన్.టి.పి.సి. అన్నపూర్ణ కాలనీకి చెందిన పాల వ్యాపారి వెంకటేశ్వరరావు హత్యకు గురయ్యాడు. రామగుండం సీఐ కృష్ణ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గత 30 సంవత్సరాల నుంచి పాల వ్యాపారం చేసుకుంటూ అన్నపూర్ణ కాలనీలో కుటుంబంతో వెంకటేశ్వరరావు నివసిస్తున్నాడు. అతడి ఇంటి ముందు ఉన్న నరేష్ అనే వ్యక్తితో వెంకటేశ్వరరావుకు పాత గొడవలు ఉన్నాయి.ఈ కారణంగా వెంకటేశ్వరరావుపై కక్ష పెంచుకున్న నరేష్ తన స్నేహితుడితో కలిసి సోమవారం రాత్రి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద అతడిపై కర్రలతో దాడి చేసి హతమార్చారు.బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నరేష్, అతడి మిత్రుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సిఐ తెలిపారు.

# బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం



ప్రజాపక్షం/సుల్తానాబాద్: బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యగా సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ ఆదేశాల మేరకు నర్సయ్య కుంటతో పాటు మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాన్ని బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో పూర్తిగా శుభ్రం చేయించారు.పండుగ వేళ పరిశుభ్రమైన వాతావరణంలో మహిళలు ఆనందంగా బతుకమ్మ ఆడేందుకు వీలుగా చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసరాలను శుభ్రపరిచినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరెపల్లి హేమంత్ రాజ్, మున్సిపల్ సిబ్బంది ఆనంద్ పాల్గొని పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుదాం

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తూ, నియంతృత్వ ధోరణులతో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఎన్నికల కమిషన్‌ను తన రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటోందని ఆరోపించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలి పక్షపాతంగా ఉందని విమర్శించారు.దేశంలో ఎన్నికల వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఇంత కఠినమైన నిబంధనలతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) చేపట్టడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న విద్యార్థులు, యువత, కార్మికులు, ప్రజలపై దేశద్రోహం వంటి తప్పుడు ఆరోపణలు మోపుతూ ఉద్యమాలను అణిచివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టేందుకు కార్మిక వర్గం, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్యతో పాటు రాజమల్లు, బ్రహ్మచారి,వీరగోని కిరణ్ గౌడ్,పూసల సంపత్,సదయ్య,విలాస్,వెంకటేష్,మంజూర్,శంకర్, రామచందర్, అరవింద్, ఆరేపల్లి సురేష్, కల్వల ఎల్లయ్య, మహంకాళి మల్లేష్, ఎనగందుల కుమార్, కుమ్మరి సత్యం ,పోగుల మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరి నిర్మూలనకు చైతన్యం అవసరం



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : సమాజంలో ఇంకా కొనసాగుతున్న వెట్టిచాకిరీ వ్యవస్థపై ప్రజల్లో చైతన్యం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక నాయకులు గుండావేణ స్వామి పేర్కొన్నారు.ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పర్యటనలో భాగంగా వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రదర్శిస్తున్న అవగాహన నాటక కార్యక్రమం మంగళవారం పెద్దపల్లి జిల్లాకు చేరుకుంది.స్థానిక నాయకులు గుండావేణ స్వామి ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా కలెక్టర్‌ను, కళాకారులను కోరడంతో మంగళవారం పెద్దకల్వల గ్రామంలో ఈ నాటక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గుండావేణ స్వామి మాట్లాడుతూ సాంకేతికత విప్లవం సాధిస్తున్న ప్రస్తుత కృత్రిమ మేధ యుగంలో కూడా కొన్ని ప్రాంతాల్లో వెట్టిచాకిరీ వ్యవస్థ ఇంకా కొనసాగడం బాధాకరమన్నారు.కార్మికులు పని వదిలి వెళ్లకుండా వారి ధ్రువపత్రాలు,విలువైన వస్తువులను యజమానులు తమ వద్దే పెట్టుకుని తీవ్ర ఒత్తిడికి,బెదిరింపులకు గురిచేస్తున్నారని తెలిపారు.ఇలాంటి అన్యాయాలకు గురవుతున్న బాధితులు అధైర్యపడకుండా తక్షణమే 08069434343 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని ఆయన సూచించారు.వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.పెద్దకల్వల గ్రామంలో ఈ నాటక ప్రదర్శన ఏర్పాటుకు అనుమతి కల్పించిన జిల్లా కలెక్టర్‌కు,ప్రదర్శన నిర్వహించిన ఐజేఎం కళాకారుల బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,కళాకారులు,తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సుభాష్ నగర్‌లో కార్డన్ సెర్చ్ – 20 ద్విచక్ర వాహనాలు సీజ్ : సిఐ రంజిత్ రావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సుల్తానాబాద్ సిఐ రంజిత్ రావు ఎస్సై చంద్రకుమార్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్ నగర్‌లో మంగళవారం సుల్తానాబాద్ పోలీసులు కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించిన ఆయన,గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియజేయరాదని సూచించారు.అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.అతివేగం మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్,ఎస్ఐ అశోక్ రెడ్డి తదితర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా దసరా మహోత్సవ ఛాంపియన్ ట్రోఫీ ప్రారంభం



ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన దసరా మహోత్సవ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు,మాజీ జడ్పిటిసి చొప్పరి సదానందం,పారుపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్, జిల్లా కార్యదర్శి అంబటి చంద్రమౌళి,జిల్లా ఎగ్రికల్చర్ మెంబర్ తలపల్లి కుమార్ గౌడ్,కిసాన్ సెల్ అధ్యక్షులు గాదం శ్రీనివాస్,యువజన అధ్యక్షులు ఐక్యతల్ల వినీత్,గ్రామ శాఖ అధ్యక్షుడు కోల విజయ్ కలిసి ఈ టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీడల ద్వారా యువతలో ఐక్యత, స్నేహభావం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ టోర్నమెంట్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు, స్థానిక యువతీ యువకులు, మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు సాయి కిరణ్, పవన్, కౌశిక్ ఈ క్రీడా పోటీలకు హాజరైన క్రీడాకారులందరికీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెద్దపల్లిలో ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ & రిజిస్ట్రేషన్ మేళా



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) కోసం ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళా నేడు నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార భద్రత అధికారి తెలిపారు.ఈ మేళా పెద్దపల్లి నందు ఇంటిగ్రేటెడ్ జిల్లా కార్యాలయ సముదాయం (ఐడిఓసి), గది నెం. 104 లో, ఉదయం 11.00 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించబడుతోందని తెలిపారు.ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు పొందడం లేదా రెన్యువల్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఇతర వివరాల కొరకు 9666587569 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

# పారుపల్లి ఘటనపై ఎసిపి విచారణ



ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న వివాదంపై పోలీస్ యంత్రాంగం దర్యాప్తును వేగవంతం చేసింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో పాటు మరో యువకుడికి మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై రామగుండం ఎసిపి మడత రమేష్ మంగళవారం ప్రత్యేక విచారణ చేపట్టారు.బాధిత పారుపల్లి గ్రామాన్ని సందర్శించిన ఎసిపి, ఘటనకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసు దర్యాప్తులో భాగంగా స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ విచారణ కార్యక్రమంలో ముత్తారం ఎస్సై రవికుమార్, రామగిరి ఎస్సై శ్రీనివాస్‌తో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ స్పీకర్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి భవిష్యత్ లో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ ఉద్యమకారుడు పోసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. మధుసూదన చారి జన్మదిన వేడుకలు మంగళవారం పెద్దపల్లి స్ఫూర్తి దివ్యాంగుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.కేక్ కట్ చేసి,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మధుసూదన చారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎండీ జహంగీర్,శ్రీనివాస్,అన్వేష్, షరీఫ్,మంచు రామస్వామి,నర్సయ్య,రిషి,జబీర్,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన సుల్తానాబాద్ గురుకుల విద్యార్థులు





ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సుల్తానాబాద్ గురుకుల పాఠశాల విద్యార్థులు పీ. బన్నీ, పీ. శివరాం హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెద్దపల్లి జిల్లా తరఫున పాల్గొని తమ ప్రతిభను చాటారు.రాష్ట్రస్థాయి క్రీడా వేదికపై జిల్లా తరఫున పోటీ పడిన ఈ విద్యార్థులను సుల్తానాబాద్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. కోటి, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్, పీఈటీ సురేందర్ అభినందించి,వారి కృషి, పట్టుదల ప్రశంసనీయమని కొనియాడారు.భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు విజేతలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామపంచాయతీ కార్మికుడికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని కౌట బి గ్రామంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామ పంచాయతీ కార్మికుడు గంగాధర్ విరేష్ నిరుపేద కుటుంబానికి చెందినా వ్యక్తి.వారి ఆర్థిక పరిస్థితులు చాలా ఇబ్బంది కరంగాఉంది..వారికి చేయుతగా స్నేహితుల అభివృద్ధి ఫోరం కౌట( బి) వారి ఆధ్వర్యంలో 5000 రూపాయలు అందచేయడం జరిగింది.మాజీ సర్పంచ్ కొంకటి గంగాధర్ 2000 రూపాయలు అందచేశారు.ఇంకా ధాతులు ఎవరయినా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయగలరు అని కుటుంబ సభ్యులు తెలిపారు.

## రావుల రాంనాథ్‌కు 'అలయ్‌బలయ్' ఆహ్వానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** హర్యానా మాజీ గవర్నర్, సీనియర్ నాయకులు బండారు దత్తాత్రేయ ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా ఎంతో ఘనంగా నిర్వహించే సాంప్రదాయ 'అలయ్ బలయ్' కార్యక్రమానికి రావాల్సిందిగా బిజెపి రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్‌కు ఆహ్వానం అందజేసింది. మంగళవారం బండారు దత్తాత్రేయ రావుల రాంనాథ్‌కు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. 22 వ తేదీ గురువారం రోజున హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు. ఈ సంభాషణ సందర్భంగా బండారు దత్తాత్రేయ రావుల రాంనాథ్ యొక్క క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ, పార్టీ పరిస్థితుల పై కూడా చర్చించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ అలయ్ బలయ్ వేడుకల్లో రాజకీయ, సాంస్కృతిక ప్రముఖులు పాల్గొననున్నా రు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం /తానూర్ :** భూముల రీసర్వేలో భాగంగా జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా మండల కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో కొనసాగుతున్న రీసర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూముల హద్దులు, కొలతల నిర్ధారణ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. సర్వే విధానం, నమోదు చేస్తున్న వివరాలు, రైతులకు నోటీసులు ఇచ్చే విధానంపై అధికారులను ఆరా తీశారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి, రీసర్వేపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్‌కు మాజీ సర్పంచ్ జాదవ్ మాధవ రావు పటేల్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా సర్వే నిర్వహించాలని తహసీల్దార్ మహేందర్ నాథ్, మండల సర్వేయర్ పవార్ కిషన్, లైసెన్స్ సర్వేయర్లకు కలెక్టర్ సూచించారు. రీసర్వే వల్ల భవిష్యత్తులో భూ తగాదాలు ఉండవు, రికార్డుల్లో స్పష్టత వస్తుంది. రైతులు తమ భూముల హద్దుల సమాచారం ఇచ్చి సహకరించాలి అని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### రీ సర్వే ప్రక్రియలో రైతుల సహకారం అవసరం: కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** భూముల రీ సర్వే ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.మంగళవారం తానూరులో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను సర్వే పురోగతి,చేపడుతున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే నిర్వహించే ముందు సంబంధిత రైతులందరికీ ముందస్తుగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహిస్తూ, ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సర్వే బృందంలోని సిబ్బంది అందరూ విధిగా పాల్గొని,నిర్దేశించిన గడువులోగా రీ సర్వేను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్,భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియను చేపడుతోందని తెలిపారు. సర్వే సమయంలో సంబంధిత భూముల రైతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ మహేంద్రనాథ్,సర్వేయర్ కిషన్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పారితోషికం



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలో టీచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 2025–2026 సంవత్సరంలో బోథ్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎస్సి పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలు పొందిన విద్యార్థిని విద్యార్థులకు సన్మానించడం తోపాటు పారితోషకం ఒక్కొక్క విద్యార్థికి 1500రూపాయలు అందించడం జరిగింది.వారి వివరాలు జిల్లా పరిషత్ గర్ల్స్ బోథ్ ఎం.శివాని ఏ.అక్షర జిల్లా పరిషత్ బాలురు బోథ్ శ్రీరామ్, హర్షిత్, జిల్లా పరిషత్ ఉర్దూమీడియం బోథ్ ,అఫ్రీన్, రేష్మ ప్రభుత్వం హైస్కూల్ బోథ్, శివకుమార్.ఆర్.కృష్ణ. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ఇటీవల ప్రకటించిన నీటి ఫలితాల్లో ఎంబీబీఎస్ సీటు పొందిన నిరుపేద విద్యార్థికి ఈ.సాయి చరణ్ కి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించి సన్మానంచేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, టిడబ్ల్యూఎస్ సంఘం సభ్యులు పాల్గొనడం జరిగింది.

# సామాజిక వికాసానికే స్వయం సహాయక సంఘాలు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ ఆవరణలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 189 మంది సీనియర్ ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ.. వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాలలో చేరడం వల్ల కలిగే ఆర్థిక, సామాజిక ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పొదుపు అలవాటు, ఆర్థిక స్వావలంబన, సంఘాల ద్వారా లభించే పరస్పర సహకారం, జీవనోపాధి అవకాశాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను వివరించారు. వయోవృద్ధులు సమాజానికి భారం కాకుండా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్వయం సహాయక సంఘాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.సమాజంలో వయోవృద్ధులకు లభించే గౌరవం, భద్రతలతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులు సూచించారు. అనంతరం బతుకమ్మ పండుగ వాతావరణాన్ని తలపించేలా వయోవృద్ధులచే స్వయంగా బతుకమ్మలను తయారు చేయించి, ఉత్సాహంగా ఆడించడం జరిగింది. ఈ వేడుకల్లో వయోవృద్ధులు ఎంతో ఆనందంగా పాల్గొని తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏపీడీ ఓసా ప్రసాద్,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు,ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, డీపీఎంలు, ఏపీఎంలు, డీఎమ్ఎమ్‌యూ వింగ్ సిబ్బంది మరియు జిల్లాలోని వివిధ మండలాల సీనియర్ స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# చోరీ కేసును ఛేదించిన నిర్మల్ పట్టణ పోలీసులు




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, లోన్ యాప్‌ల వేధింపులకు తాళలేక సొంత ఇంట్లోనే దొంగతనానికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను నిర్మల్ పట్టణ పోలీసులు 24 గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ టౌన్ పరిధిలోని గాజులపేటకు చెందిన మహమ్మద్ ఔసఫ్ అహ్మద్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఆటో ద్వారా వచ్చే సంపాదన తన జల్సాలకు సరిపోకపోవడంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు.బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకోవడంతో వాటిని తీర్చడానికి లోన్ యాప్‌లలో అప్పులు చేశాడు.లోన్ యాప్ ఏజెంట్ల నుంచి ఒత్తిడి తీవ్రమవ్వడంతో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు.ఈ క్రమంలో 12న కుటుంబ సభ్యులందరూ ఫంక్షన్‌కు వెళ్లడంతో, పథకం ప్రకారం రాత్రి 10 గంటల సమయంలో ఖాళీగా ఉన్న సొంత ఇంటికి కన్నం వేసి బంగారు,వెండి ఆభరణాలను దోచుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిర్మల్ జిల్లా ఎస్పి డాక్టర్ జి. జానకి షర్మిల ఆదేశాలతో నిర్మల్ సబ్ డివిజనల్ డిఎస్పి శ్రీనివాస్ పర్యవేక్షణలో రంగంలోకి దిగిన పట్టణ పోలీసులు 24 గంటల్లోనే కేసును ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.నిందితుడి వద్ద నుండి సుమారు 90.7 గ్రాముల బంగారు ఆభరణాలు, 142.7 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు ఒక హోండా మోటార్ సైకిల్, దొంగతనానికి ఉపయోగించిన ఇనుప బరిసెను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేగవంతంగా కేసు ఛేదించిన నిర్మల్ టౌన్ ఇన్ స్పెక్టర్ బి. సమ్మయ్య, సబ్ ఇన్ స్పెక్టర్ ఎం.అజయ్ మరియు పీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## బాగాపూర్‌లో ఘనంగా దుర్గాదేవి ఉత్సవాలు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని బాగా పూర్ గ్రామంలోని దుర్గాదేవి శరవన్ నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు.మూడవరోజు అన్నపూర్ణదేవీకీ గ్రామస్తులు ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీ వేద ప్రణీత్ రెడ్డి, గ్రామస్తులు మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు ప్రత్యేక పూజలు అభిషేకాలు దుర్గాదేవికి నిర్వహిస్తామని మహిళలు,గ్రామ పెద్దలు,యువకులు గ్రామస్తులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే పాడిపంటలు, వ్యాపారాలు వృద్ధి చెందాలని, ఆయురారోగ్యంగా ఉండాలని దుర్గాదేవికి కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వీడీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బావాపూర్-కె గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



**ప్రజా పక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ ఎమ్మెల్యే నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఖానాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ ఆధ్వర్యంలో బావాపూర్‌కె గ్రామ కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీగా గౌరవ అధ్యక్షులు దూస నారాయణ,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు గోడిసెలరాజేశ్వర్, ఉపాధ్యక్షులు కడారి రాములు,ప్రధాన కార్యదర్శి అన్నవేణి రాజన్న,కోశాధికారి జక్కుల చిన్న రాజన్న,కార్యదర్శి చిన్న రాజన్న,యూత్ అధ్యక్షులు కోరెపు రాజలింగు, యూత్ ఉపాధ్యక్షులు బీర్ల చిన్న రాజన్న, ఎస్సీ సెల్ అధ్యక్షులు కోరెపు పెద్దలు, బీసీ సెల్ అధ్యక్షులు దాసరిగౌండ చిన్నరాజన్న,కిసాన్ సెల్ అధ్యక్షులు గుంట మల్లయ్య,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కోరెపు వెంకటేష్,దాసరిగౌండ రాములు,ఎల్లఎల్లయ్య,సదుల నారాయణ,ముఖ్య సలహాదారులు బీర్ల రాజన్న, దాసరిగౌండ మల్లయ్య.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి దయానంద్, డీసీసీ కార్యదర్శి రాజేందర్,ఆత్మ కమిటీ చైర్మన్ సత్యం, పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్, తర్లపాడు సర్పంచ్ పోలంపల్లి సచిన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ నర్సయ్య, పార్టీ మండల ఉపాధ్యక్షులు బిక్కు నాయక్, మదిరే సత్యనారాయణ, బిక్కి చిన్న రాజన్న, గోడల పంపు ఉపసర్పంచ్ మల్లేష్, నేత శ్యాం, రాజలింగు, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దశాబ్ద కాలం తర్వాత నిర్మల్ జిల్లాలో మొట్టమొదటిసారిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు రాష్ట్రంలోనే ప్రథమంగా ఏకగ్రీవంగా ముగిశాయి. మంగళవారం స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారుల సమక్షంలో నిర్మల్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నూతన చైర్మన్‌గా జి.జనార్ధన్ తో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు.ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్నికల అధికారులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులందరికీ అధికారిక ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు,సామాజిక కార్యకర్తలు, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు ఘనంగా శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. ఇందులో భాగంగా తెలంగాణ ముస్లిం ఏక్తా సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షులు సాజిద్, ప్రధాన కార్యదర్శి అల్మాస్ ల చేతుల మీదుగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరినీ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## కాంగ్రెస్ నేతల పూజలు

**ప్రజాపక్షం / దండేపల్లి :** దండేపల్లి మండలంలోని తాళ్ళపేట, దండేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మంటపాల వద్ద కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మంతెన జగన్మోహన్ రావు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఐకమత్యంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా దసరా నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గడ్డం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపిపి ఆకుల రాజేందర్, నాయకులు చీటీ సత్యంరావు, సర్పంచులు కళావతి, రాజవ్వ, ఉప సర్పంచులు పుట్టపాక తిరుపతి, ప్రభాకర్, నాయకులు ముత్తే రాజన్న, సుభాష్, నలిమెల అశోక్, రవీందర్, దయాకర్ పాల్గొన్నారు.

## రోగులకు అన్నదాన సేవ



**ప్రజాపక్షం / బెల్లంపల్లి టౌన్ :** దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో బాయిజమ్మ సాయి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు కనుకుంట్ల ప్రశాంత్, శ్రీలేఖ, శ్రీనివాస్, సరోజన, ఆడెపు సదానందం, దేవేంద్ర కుటుంబాల సహకారంతో ఆసుపత్రిలోని గర్భిణులు, బాలింతలు, దయాలసిస్ రోగులకు ఆహారం అందించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్, రాజేశ్వరి తెలిపారు. ఆకలితో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన మానవసేలని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు చంద్రకళ, పోతురాజుల తిరుపతి, వరాల క్రాంతి, భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు తక్కువ ధరకే అల్పాహారం



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** నిరుపేదలకు అతి తక్కువ ధరకే టి, టిఫిన్‌ను అందించాలనే ఉద్దేశ్యంతో హిందు సేవ సమాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు బండవరపు జగన్ ప్రవంతి తెలిపారు. మంగళవారం మంచిర్యాలలోని ఎన్టిఆర్ నగర్‌లో టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఐదు రూపాయలకే టి, 20 రూపాయలకే టిఫిన్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా టిఫిన్ రేట్లు పెరిగిపోయి చాలా మంది నిరుపేదలకు తినలేక పోతున్నారని అలాంటి వారికి టిఫిన్‌ను 20 రూపాయలకే అందించే లక్ష్యంగా హిందు సేవ సమాజ్ ఫౌండేషన్ ముందుకు వచ్చిందన్నారు. ఇప్పటికే తక్కువ రేట్లకు రక్త పరీక్షలను నిర్వహిస్తున్నామని, తక్కువ ధరలకే అంబులెన్స్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు ప్రతాప్, శేఖర్, గాదె సత్యం, రమేష్, శ్రీనివాస్, చిలువేరు శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఆర్అండ్ బి వంతెన వద్ద గండి

సబ్‌స్టేషన్ సమీపంలో
ప్రమాదకరంగా మారిన వంతెన



**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గల ఆర్అండ్‌బి వంతెన ఒక వైపు గండి పడింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఏర్పడిందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన మార్గంలో వంతెన ఒకవైపు కుంగిపోయి దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అంతేకాకుండా, వంతెన వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తగా ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి, ప్రయాణికులను అప్రమత్తం చేసే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మందమర్రి ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ



**ప్రజాపక్షం / మందమర్రి:** పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, సింగరేణి యాజమాన్య ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా కెకె 2 బంగ్లా ప్రాంగణంలో మంగళవారం శ్రమదానం నిర్వహించారు. జిఎం స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేసి ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత అనేది ఒక రోజుకే పరిమితం కాకుండా నిత్యజీవితంలో భాగం కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలని సూచించారు. 31 లోగా అన్ని గనులు, కార్యాలయాలు, నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు స్క్రాప్ పారవేత, పాత రికార్డుల తొలగింపు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు బాలాజీ భగవతి, కిరణ్ కుమార్, మురళి, వెంకట్ రెడ్డి, నవీన్, మదీనా భాష, బాబు, రవి, సురేందర్, వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలి



**ప్రజాపక్షం / మంచిర్యాల :** అంగన్‌వాడీలకు కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భూపతి రమాదేవి, జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాలలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీలకు దసరా సెలవులతో పాటు టీచర్లు, ఆయాల బదిలీలు, పదోన్నతులు ఎఐటియుసి పోరాటాల ఫలితంగానే సాధ్యమయ్యాయని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్ఐఆర్ వంటి ఇతర ప్రభుత్వ కార్యక్రమాల పేరిట అదనపు పనిభారం మోపుతూ ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని మండిపడ్డారు. వేతనాలను ప్రతి నెలా 1వ తేదీనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న టిఏ, డిఎలు, ఇతర అలవెన్సులను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేఖ, నాయకులు నేరెళ్ల అరుణ, వేంపల్లి అరుణ, తిరుమల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ సేవలు వినియోగించుకోవాలి

కలెక్టర్ కె. హరిత

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టు ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె. హరిత కోరారు. సిర్పూర్–కాగజ్ నగర్ రైల్వే స్టేషన్‌లో ఈ నెల 16 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు 257వ లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో వివిధ విభాగాల వారీగా ఉచిత పరీక్షలు, వైద్య సంప్రదింపులు, శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అక్టోబర్ 16 నుంచి 21 వరకు కంటి పరీక్షలు (17 నుంచి 22 వరకు శస్త్రచికిత్సలు), 22 నుంచి 27 వరకు చెవి పరీక్షలు (23 నుంచి 28 వరకు శస్త్రచికిత్సలు), 28 నుంచి 31 వరకు ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ పరీక్షలు (29 నుంచి నవంబర్ 1 వరకు శస్త్రచికిత్సలు) జరుగనున్నాయి. నవంబర్ 1 నుంచి 5 వరకు దంత వైద్య సేవలు, అక్టోబర్ 16 నుంచి 21 వరకు మహిళల గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. బాధితులు ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డులతో హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. రోగితో పాటు ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుందని, వివరాలకు 7039673973 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

## భూ సర్వేతో సమస్యలకు పరిష్కారం: ఆర్‌డిఒ

**ప్రజాపక్షం / మందమర్రి :** సమగ్ర భూ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్‌డిఒ శ్రీనివాస్, తహసీల్దార్ సతీశ్ కుమార్ తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామంలో సమగ్ర భూ సర్వేపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సరిహద్దులు, విస్తీర్ణం, రికార్డుల్లోని వ్యత్యాసాలను సరిదిద్దేందుకు ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలించి రికార్డులను పక్కాగా రూపొందించడం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలకు తావుండదని స్పష్టం చేశారు. రైతులు తమ భూముల వివరాలను అందించి సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ సంతోశ్, సర్పంచ్ దివ్యసతీశ్, ఉపసర్పంచ్ పోశం, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మాంగ్ సమాజ్ భవనం మంజూరు చేయాలి

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతి



**ప్రజాపక్షం / జైనూర్ :** జైనూర్ మండల కేంద్రంలో ఎస్సి మాంగ్ సమాజ్ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మోహాలే దత్త కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సమావేశాలు, యువత శిక్షణ, అవగాహన సదస్సుల నిర్వహణకు భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మండల కేంద్రంలో భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, నిధులు మంజూరు చేసి త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

## రీసర్వే పనుల పరిశీలన



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి మంగళవారం పెంచికల్‌పేట్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని గుంట్లపేట గ్రామంలో కొనసాగుతున్న కాడాస్ట్రల్ రెవెన్యూ గ్రామ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ రికార్డులను, కార్యాలయ పనితీరును తనిఖీ చేశారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అనంతరం ఎల్కపల్లి గ్రామ పరిధిలోని ఇసుక రీచ్‌ను పరిశీలించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ రాజేశ్వర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గుండా మల్లేష్‌కు ఘన నివాళులు



**ప్రజాపక్షం / మందమర్రి :** కార్మిక పక్షపాతి కామ్రేడ్ గుండా మల్లేష్ 6వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మందమర్రి పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో సిపిఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వనం సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్ మాట్లాడుతూ గుండా మల్లేష్ జీవితాంతం పేదలు, కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు వామపక్ష శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటాలను బలోపేతం చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వెంకన్న, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంటోనీ దినేష్, ఎం.డి. రసూల్, జక్కనబోయిన సమేందర్, హమాలీ సంఘం నాయకులు సంపత్, సాగే పోశం, పూరెల్ల శ్రీనివాస్, ఆవుల కుమార్, పూరెల్ల మహేష్, దామరకుంట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ సేవలపై అవగాహన



**ప్రజాపక్షం / హాజీపూర్ :** హాజీపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి సిబ్బంది, ప్రజాప్రతినిధులకు మంగళవారం ఫిజియోథెరపీ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్టులు డాక్టర్ రమేష్, డాక్టర్ సురేష్ మాట్లాడుతూ శారీరక సమస్యల నివారణలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, చికిత్సా విధానాల గురించి వివరించారు. నిత్య జీవితంలో ఎదురయ్యే నొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలకు ఫిజియోథెరపీ ద్వారా లభించే పరిష్కారాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎంపిఒ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సామాన్యుడి కంచంలో ‘బువ్వ’ భారం!

### ఎల్ నినో సాకుతో వ్యాపారుల కృత్రిమ కొరత
### దోపిడిపై ప్రజలు ఆగ్రహం



**ప్రజాపక్షం /నిర్మల్ :** రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య, దిగువ మధ్యతరగతి కుటుంబాల జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.ఒకప్పుడు సాధారణ సగటు కుటుంబం నెలవారీ బడ్జెట్‌లో ఆహార వ్యయం పరిమితంగా ఉండేది. కానీ నేడు బియ్యం, కాయగూరలు, పప్పుదినుసులు,వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుడి కంచంలో బువ్వ కూడా భారంగా మారిపోతోంది. ప్రతిరోజూ రెక్కాడితే గానీ డొక్కాడని దినసరి కూలీలు, చాలీచాలని జీతాలతో బతికే ఉద్యోగులు వంటగది బడ్జెట్‌ను సమన్వయం చేసుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లో అత్యంత ప్రాథమిక అవసరమైన బియ్యం ధరలు గత కొన్ని నెలలుగా గణనీయంగా పెరిగాయి. దీనికి తోడు కందిపప్పు, మినపప్పు వంటి ప్రధాన దినుసుల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. మరోవైపు, రోజువారీ వంటల్లో తప్పనిసరిగా వాడే టమాటా,ఉల్లిపాయలు, పచ్చిమిర్చితో పాటు ఇతర అన్ని రకాల కాయగూరల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి తగ్గడం, రవాణా ఖర్చులు పెరగడం వల్ల హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరలు భారీగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఆదాయాలు పెరగని ప్రస్తుత పరిస్థితుల్లో, నిత్యావసరాల ధరలు మాత్రం నిరంతరం పెరుగుతుండటంతో కుటుంబ పోషణ సవాలుగా మారింది. నెలవారీ సంపాదనలో సగానికి పైగా కేవలం భోజనం, వంటగది ఖర్చులకే సరిపోతోందని గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పిల్లల చదువులు, వైద్యం, ఇంటి అద్దెలు వంటి ఇతర అత్యవసర ఖర్చులను కోత విధించుకోవాల్సి వస్తోంది. రోజువారీ మార్కెట్‌కు వెళ్లే సామాన్యుడు కాయగూరల ధరలు చూసి అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధరల మంట నుంచి ఉపశమనం లభించేలా ప్రభుత్వాలు తక్షణమే రంగంలోకి దిగాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నిత్యావసరాల అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతు బజార్ల ద్వారా నేరుగా వినియోగదారులకు తక్కువ ధరలకే కూరగాయలు అందేలా చూడాలని, చౌకధరల దుకాణాల (రేషన్ షాపులు) ద్వారా నాణ్యమైన పప్పు దినుసులు,వంటనూనెలను రాయితీ ధరలపై విస్తృతంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి, ధరల నియంత్రణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తేనే సామాన్యుడికి ఆహార భద్రతతో పాటు ఆర్థిక ఊరట లభిస్తుంది.

## దుర్గాదేవి చండీహోమం



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల పట్టణంలోని హైటెక్ సిటి హరిహర క్షేత్ర దేవాలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం చండీహోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయప్రాంగణంలో అమ్మవారి చండీహోమం నిర్వహించారు. అనంతరం హైటెక్ సిటి ఆర్యవైశ్య కుటుంబాలచే పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో దుర్గాదేవి భక్తులు చండీ హోమంతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు

## గాండ్లపేట్‌లో గ్రానైట్ లారీ బోల్తా

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** మండలంలోని గాండ్లపేట్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఓ పెద్ద లారీ బోల్తా పడిందని గ్రామస్తులు తెలిపారు. ఈ లారీ కరీంనగర్ నుండి ఢిల్లీకి గ్రానైట్ రాయిని తరలిస్తుందని, మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడిందని తెలిపారు. లారీలో డ్రైవర్‌తో పాటు మిగతా ముగ్గురికి పె ద్ద ప్రమాదం తప్పిందని వారంతా స్వల్ప గా యాలతో బయటపడ్డారని తెలిపారు. బోల్తా పడ్డ లారీని గ్రామస్తులు జెసిబి సాయంతో తీశారు.

## శివపార్వతుల కల్యాణం

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింహాస్వామి ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవంలో భాగంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించటానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మూడవ రోజు దేవి అన్నపూర్ణ అవతారం దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్, కోశాధికారి రవి, సుంకెట రమేష్, గుండోజి నరేష్, రాంపల్లి ఉదయ్‌కుమార్, పెంట కిషన్, సభ్యులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్‌పాస్ పనుల కారణంగా దారి మళ్లింపు



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ పట్టణంలో గల కంఠేశ్వర్ రైల్వే అండర్‌పాస్ పనుల కారణంగా ఎన్‌టిఆర్ చౌరస్తా వైపు నుండి జడ్పి చౌరస్తా, కంఠేశ్వర్ బైపాస్ వెళ్ళే దారిలో ఒకవైపు గల రైల్వే అండర్‌పాస్ విస్తరణ పనులను దక్షిణ మధ్య రైల్వే డబుల్ ట్రాక్ వర్క్ చేపట్టడం కారణంగా శుక్రవారం 16వ తేదీ ఉదయం నుంచి సుమారు 45 రోజుల వరకు వాహనాలు వెళ్లడానికి మూసి వేయబడునని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు కింద తెలుపబడిన మార్గాల గుండా తమ ప్రయాణాలు సాగించాలన్నారు. నిజామాబాద్ లోపలికి వచ్చే వాహనాలు అనగా ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, కామారెడ్డి, హైదరాబాద్ నుండి నిజామాబాధ్ పట్టణం లోపలికి వచ్చే వాహనాలు నేరుగా పాత దారి వెంబటే అనగా కంఠేశ్వర్ బైపాస్, మీసేవా కంఠేశ్వర్, ఒకవైపు పని పూర్తయిన రైల్వే అండర్ పాస్ గుండా ప్రయాణిస్తూ ఎన్‌టిఆర్ చౌరస్తా చేరుకొని అక్కడి నుండి కుడి చేతి వైపు తిరిగి రైల్వేస్టేషన్ ముందర నుండి బస్టాండ్ చేరుకోవాలి. నిజామాబాద్ వైపు నుండి ఆర్మూర్, కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, హైదరాబాద్ వైపు వెళ్ళే వాహనాలు దేవి రోడ్డు రైల్వే ఫ్లై ఓవర్‌ని ఉపయోగించి దుబ్బ శివాజీ స్టాచ్యు, దుబ్బ రోడ్డులో ప్రయాణిస్తూ దుబ్బ చౌరస్తా శ్రీ మహాలక్ష్మి ఆలయం వద్ద ఎడమచేతి వైపు మలిపి ఖానాపూర్ చౌరస్తా చేరుకోవచ్చు. అలాగే మహాలక్ష్మి ఆలయం దుబ్బ చౌరస్తా నుంచి నేరుగా కూడా జిజి కాలేజ్, యు టర్న్ దాకా వెళ్ళి బైపాస్ చేరుకోవచ్చు. బైపాస్ నుండి కంఠేశ్వర్ డిఎస్ చౌరస్తా చేరుకోవచ్చు. హైదరాబాద్, కామారెడ్డి వెళ్ళే వాహనదారులు ఎన్‌టిఆర్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, పూలాంగ్ చౌరస్తా నుంచి మాధవనగర్ రైల్వే గేట్ దాటుతు మాధవనగర్ బైపాస్ నుండి హైదరాబాద్ రోడ్డు చేరుకోవచ్చు. బోధన్, బాన్సువాడ, వర్ని వెళ్ళే వాహనాలు యధావిధిగా పాత మార్గమునే అనుసరించి ప్రయాణం సాగించాలి. కావున నిజామాబాద్ నగర ప్రజలు రైల్వే అండర్‌పాస్ పని కారణంగా సుమారు 45 రోజులు జరిగే దారి మళ్లింపు ఉన్నందున, ప్రజలు పట్టణంలోనికి రావడం, పట్టణం నుండి బయటకు పోవడం కొనసాగించాలని సూచించారు.

## ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరసన



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** రాహుల్‌గాంధీ నేతృత్వంలోని నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఓటు చోరీకి వ్యతిరేకంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు గౌరవం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరుకు తన ఓటు హక్కుపై పూర్తి విశ్వాసముండేలా ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా పని చేయాల్సిన అవసరముందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు.

## దుర్గామాత మంటపం వద్ద అన్నదానం



**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని చిక్లీ గ్రామంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. 3వ రోజు మంగళవారం అమ్మవారి శ్రీ అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిక్లీ స్వ గ్రామస్తుడైన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రముఖ అడ్వకేట్ అజార్ కిషన్‌రావు 350 స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. అలాగే గరిపెల్లి శ్రీనివాస్ 250 స్టీల్ గ్లాసులను తన వంతు సాయంగా దుర్గాదేవి మండప నిర్వాహకులకు అందజేశారు. విగ్రహ దాతలైన ఆదిగం నారాయన సుభాషిని వారి ఆధ్వర్యంలో మహాన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అజార్ నాగేశ్వర్‌రావు, సర్పంచ్ భూమన్న, ఉపసర్పంచ్ సతీష్, రమేష్, సాయిలు, రాజు, లడ్డు, రవి, దుర్గామాత మాలదారణ స్వాములు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## దళిత యువకుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ:** హత్యకు గురైన బుగ్గారం గ్రామానికి చెందిన దళిత యువకుడు నాతరి సతీష్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహారం, పునరావాసం కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూడల స్వామి మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 17న జరిగిన ఈ కిరాతక ఘటనపై కేసులు నమోదైనా నాలుగు నెలలుగా బాధితులకు చట్టపరమైన సాయం అందలేదన్నారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరెల్లి మల్లేష్ మాదిగ, గజ్జల శంకర్, కారెం రవి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా 36వ డివిజన్‌లోని నాందేవ్‌వాడలో అమ్మవారి మంటపాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని మాట్లాడారు. అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని అందరిపై భవాని మాత దయ ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో 36 వ డివిజన్ కార్పొరేటర్ ధాత్రిక రేవతి పరమేశ్వర్, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

## గుండా మల్లేష్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం/మావల:** భుక్తాపూర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ 6వ వర్ధంతి సభను ఎఐటియుసి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం గుండా మల్లేష్ చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కట్ట కిష్టయ్య, భాస్కర్, గేడం కేశవ్, చిరంజివి, భాసీం పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన మహానాయకుడు

### ముడుపు ప్రభాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ 6వ వర్ధంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గుండా మల్లేష్ పేదల బాంధవుడని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారన్నారు. సింగరేణి కార్మికుల కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్దంగి రమేష్, కుంటాల రాములు, షేక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## గుండా మల్లేష్ ఆశయ సాధనకు కృషి

### ముడుపు నళిని రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** మావల మండలం రాంనగర్ పదవ వార్డులో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి ఆధ్వర్యంలో గుండా మల్లేష్ 6వ వర్ధంతిని మంగళవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, సిపిఐ ఫ్లోర్ లీడర్‌గా పని చేసిన గుండా మల్లేష్, తెలంగాణ ఉద్యమంలోనూ పేదల సంక్షేమంలోనూ కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమీనా ఖాన్, షేక్ పాషా, కుంటాల రాములు, కొడప సురేష్ తదితరులు పాల్గొన్నారు.

